ప్రజాశక్తి

గురువారం 3 ఏప్రిల్ 2025

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

బలగం ఉంటే సరిపోద్దా?



- ఊగిసలాటలో ప్రధాన పార్టీల కార్పొరేటర్లు
- ఉత్కంఠ రేపుతున్న అవిశ్వాసం
- వేర్వేరు క్యాంపుల్లో ప్రధాన పార్టీలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మహా విశాఖ నగర రాజకీయం తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బిజెపి, వైసిపి పార్టీల అధిష్టానాలు వారి వారి కార్పొరేటర్ల బలా బలాలు తగ్గిపోకుండా వివిధ చోట్ల క్యాంపుల్లో ఉంచే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై అవిశ్వాసం తెలియజేస్తూ కూటమి కార్పొరేటర్లు జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్చార్జి కమిషనర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు లేఖ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఈనెల 19న కౌన్సిల్ సమావేశానికి ఇన్చార్జి కమిషనర్ నిర్ణయించారు. ఈ సమావేశంలో అవిశ్వాసం నెగ్గాలంటే 74 మంది కార్పొరేటర్లు చేతులెత్తి తమ డిస్సెంట్‌ను తెలియజేయాలి. కానీ సమస్య ఇక్కడే ఉంది. జనసేన, బిజెపి కార్పొరేటర్లతో కలిపిన 'బలగం' టిడిపికి ఉన్నప్పటికీ ఈ 'బలగం'తో నెట్టుకురాగలమా? పలు అనుమానాలు, అసంతృప్తుల వాతావరణంలో అవిశ్వాసం నెగ్గగలమా? అన్న తీవ్ర ఆందోళనలో అధికార పక్షం పడింది. వైసిపి ఇప్పటికే కార్పొరేటర్లను బెంగళూరుకు తరలించి ఎవ్వరూ ఎటూ చెదరిపోకుండా ప్రయత్నాలు సాగిస్తోంది. అనేక మంది కార్పొరేటర్లు తీవ్ర ఊగిసలాటలో ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ కూడా తమ కార్పొరేటర్లను భోగాపురం సన్ రే రిసార్ట్‌కు తరలించే యత్నాల్లో నిమగ్నమైంది. పోరాట పక్షాలైన సిపిఎం, సిపిఐ ఈ ప్రధాన పార్టీల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను తీక్షణంగా పరిశీలిస్తున్నాయి.

తీర్మానం నెగ్గాలని 'కూటమి'...
వీగిపోయే యత్నాల్లో వైసిపి...

రాష్ట్రంలో అధికార మార్పిడి వైసిపి నుంచి టిడిపి (కూటమి)కి జరిగాక నగర రాజకీయాల్లోనూ పలు మార్పులు చోటుచేసుకున్నాయి. అధికార పక్షంలోకి జారిపోయిన వారి సంఖ్య ఇక్కడ గణనీయంగా ఉంది. జివిఎంసిలో సంఖ్య రీత్యా టిడిపి 48, జనసేన 11, బిజెపి 2, వైసిపి 34 (ఎక్స్అఫీషియో 3 కలిపితే 37), సిపిఎం 1, సిపిఐ 1 ఉన్నాయి. మొత్తంగా కూటమి ఎక్స్అఫీషియో సభ్యులు 11 కలిపితే వారి బలం 72 అంటే దాదాపు అవిశ్వాసం నెగ్గుకొచ్చేందుకు సరిపడా ఫిగరే. కానీ మ్యాజిక్ ఫిగర్ 74. ఇది వస్తే అవిశ్వాసం నెగ్గి అనుకున్న రీతిలో మేయర్‌ను పదవీచ్యుతున్ని చేయవచ్చు.

కానీ ఏం జరుగుతోంది?

జనసేన 11 మందిలో ముగ్గురు సభ్యులు ఊగిసలాటలో ఉండడంతో 'కూటమి'కి పెద్ద తలనొప్పిగా మారింది. దీని వెనుక నగరంలోని

మిగతా 2లో..

రోడ్డు విస్తరణ బాధితులతో ఆటలు

- భూ సేకరణ నోటిఫికేషన్‌కు విలువ ఇవ్వని ప్రభుత్వం
- టిడిఆర్‌లపై పెరుగుతున్న వ్యతిరేకత
- బాండ్లు జారీపై విఎంఆర్‌డిఎ సందిగ్ధం
- అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణపై దాగుడుమూత

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి



విస్తరించనున్న అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు

అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణలో భూములు, స్థలాలు, ఇళ్లు, ఉపాధి కోల్పోతున్న వారికి పరిహారం చెల్లింపుపై ప్రభుత్వం మాట మార్చింది. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాసం చెల్లిస్తామని 2020లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ జారీ చేసిన భూ సేకరణ ప్రకటనకు భిన్నంగా విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ)తో ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్స్(టిడిఆర్) ఇచ్చే ప్రయత్నాలు బలంగా చేస్తోంది. ఆదమరిచేలా చేసి బాధితులను దెబ్బతీయాలని చూస్తోంది. టిడిఆర్‌లను బాధితులు ఏకోన్ముఖంగా వ్యతిరేకించడంతో కొంతకాలం కాలయాపనచేసి, అవకాశం వచ్చినప్పుడు టిడిఆర్‌లు తీసుకొనేందుకు ముందుకొచ్చే కొంతమందితో అమలుచేయాలనే కుతంత్రాలు సాగుతున్నాయి. రోడ్డు విస్తరణలో నగదు చెల్లించాల్సిన పనిలేకుండా, ఆర్థిక భారం ప్రభుత్వంపై పడకుండా తాము చూసుకుంటామని ప్రగల్భాలు పలికి రోడ్డు విస్తరణ పనులకు ప్రజాప్రతినిధులు రాష్ట్ర విద్య, ఐటి శాఖమంత్రి లోకేష్‌తో శంకుస్థాపన చేయించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రోడ్డు పనులు ప్రారంభిస్తామని యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాట లోకేష్ నిలబెట్టుకున్నారని ప్రచారం చేసుకొని, అంతిమంగా పరిశ్రమాధిపతులకు ఈ రోడ్డు ఉపయోగపడేలా చేయాలని ప్రధానంగా ఇద్దరు ప్రజా ప్రతినిధులు పట్టుదలతో ఉన్నారు. కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను అనుసరించి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాసం అందించి ఆదుకోవాల్సిన ప్రజాప్రతినిధి అసహనంతో మాట్లాడ్డంపై బాధితులు

మిగతా 2లో..

విద్యుత్ ప్రయివేటీకరణ ఆపాలి

▶ వార్త 2లో..

ఆదివాసీలకు రక్షణ కల్పించాలి

▶ వార్త 8లో..

ఐఆర్ హామీని అమలు చేయాలి యుటిఎఫ్

▶ వార్త 4లో..



ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆప్కాస్ రద్దును విరమించుకోవాలి

విశాఖలో మున్సిపల్ కార్మికుల ర్యాలీ, మహాధర్నా

వార్తలు మెయిన్ 3లో..



నిందితుడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తల్లీకూతుళ్లపై ఉన్మాది దాడి

మృతిచెందిన తల్లి

గాయాలపాలైన కుమార్తె

వార్త మెయిన్‌లో...

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్



ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : గుత్తేదార్లు, అధికారులు సమష్టి కృషి చేసి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన - ఎన్‌టిఆర్ కాలనీల గృహ నిర్మాణ పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని, రోజుకు 100 నుంచి 150 నిర్మాణాలు పూర్తిచేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. లే-అవుట్ల వారీగా సమీక్షించిన కలెక్టర్ అక్కడ చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో గుత్తేదార్లతో శతశాతం పనిచేయించాలని, నిర్దేశిత లక్ష్యాల మేరకు స్టేజ్ కన్వెర్షన్ జరగాలని, నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు, లే-అవుట్ ఇన్‌ఛార్జులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. హౌసింగ్ పీడీ, ఎస్‌డిసి సత్తిబాబు, ఈఈ, డీఈలు, మండల ప్రత్యేక అధికారులు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

'బలగం' ఉంటే సరిపోద్దా?

జనసేన పార్టీ ఎమ్మెల్యే ప్రధాన కారణంగా టిడిపి భావిస్తోంది. ఆయన చేష్టలతో ముగ్గురు కార్పొరేటర్లు అటూ ఇటూ మారే యత్నాల్లో ఉన్నట్టు జనసేన పార్టీలోనే చర్చ సాగుతోంది. వైసిపితో పలువురు కూటమి కార్పొరేటర్లు టచ్‌లో ఉన్నారన్న వార్తలు కూటమి పార్టీల్లో ప్రకంపనలు రేపుతున్నాయి. అవిశ్వాసం జరిగే 19న కొద్దిమంది గైర్హాజరౌతారన్న చర్చ జోరుగా సాగుతోంది.

బలాబలాలు...

గత జివిఎంసి ఎన్నికల్లో మెజారిటీ వార్డులను గెలుచుకున్న వైసిపి రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో కార్పొరేటర్లలో సుమారు 30 మంది 'జంప్ జిలానీ'లుగా కూటమిలోని టిడిపి, జనసేనలోకి జారిపోయారు. 18 వైసిపి కార్పొరేటర్లు, 2019 ఎన్నికల్లో వైసిపి గెలిచాక ఆ పార్టీలోకి వెళ్లిన ఇద్దరు ఇండిపెండెంట్లు కూడా టిడిపిలో చేరారు. మరో ఏడుగురు కార్పొరేటర్లు ఒక ఇండిపెండెంట్ సహా జనసేనలోకి జంప్ అయ్యారు. బిజెపిలోకి మరో వైసిపి కార్పొరేటర్ చేరారు. టిడిపి (కూటమి) బలం 61కి చేరింది. వైసిపి బలం 34గా ఉంది. ఈ 34లో కూడా బెంగళూరు శిబిరంలో నలుగురు కార్పొరేటర్లు లేరన్నది తెలుస్తోంది. ఇలా కలగాపులగంగా పార్టీల బలాబలాలు నగర పాలక సంస్థలో ఉన్నాయి. మొత్తంగా 97 మంది కార్పొరేటర్లు కాగా జివిఎంసి పరిధిలో ఎమ్మెల్యేలు 8, ఎంపీలు 2, రాజ్యసభ 1 మొత్తం కలిపితే 111 మందికి ఓటు హక్కు ఉంటుంది. ఇలా హక్కు కలిగిన వారిలో 2/3 అంటే 74 మంది అవిశ్వాసానికి అనుకూలంగా ఉంటే నెగ్గుతుంది. ఇద్దరిని కూటమి వారు లాగాల్సి ఉంది. అది పెద్ద పనేమీ కాదన్నది తెలుస్తోంది. ఇప్పటికే కార్పొరేటర్లతో అధికార టిడిపి నేత కూటమి నుంచి మేయర్ ఆశావహుడైన పీలా శ్రీనివాసరావు బేరసారాలు నడుపుతున్నట్లు సమాచారం. కొంతమంది అత్యధికంగా రూ.కోట్లలో డిమాండ్ చేయడంతో 'అసమ్మతి బండి' అక్కడ ఆగింది. జనసేన నుంచి ముగ్గురు కార్పొరేటర్లు ఇటీవల నాదెండ్ల మనోహర్ నిర్వహించిన కార్పొరేటర్ల సమావేశానికి సైతం రాకపోవడంతో వీరు 19న గైర్హాజరయ్యే అవకాశాలున్నాయని వైసిపి భావిస్తోంది. అవిశ్వాసం నెగ్గే అవకాశాల్లేవని ఇటీవలే వైసిపి ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విశాఖలో వ్యాఖ్యానించడం చూస్తే ఏదైనా జరగొచ్చు అనే చర్చ తాజాగా జివిఎంసి పరిధిలో నడుస్తోంది.

రోడ్డు విస్తరణ బాధితులతో ఆటలు

తప్పుపడుతున్నారు.

ప్రజా ప్రతినిధుల ఒత్తిడితో టిడిఆర్‌ల జారీపై ఉత్సుకత ప్రదర్శించిన విఎంఆర్‌డిఎ... బాధితుల నుంచి వ్యతిరేకత రావడంతో సున్నితంగా తప్పించుకుంటోంది. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డుతో విఎంఆర్‌డిఎకు సంబంధంలేదని, ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చే వరకు ఏ నిర్ణయం తీసుకోబోమని ఓ అధికారి తెలిపారు. ఇరకాటంలో పడకుండా విస్తరించబోయే రోడ్డు ఆర్‌అండ్‌బికి చెందినది కావడంతో విఎంఆర్‌డిఎ ముందుకు వెళ్లలేక తాత్కాలికంగా వెనక్కుతగ్గింది. భూ సేకరణ నోటిఫికేషన్ సమయంలో వంద అడుగుల రోడ్డు విస్తరణకు సర్వే చేసి, విఎంఆర్‌డిఎ తన మాస్టర్ ప్లాన్ ప్రకారం 150 అడుగులకు విస్తరించనుందని చేస్తున్న ప్రచారంపై బాధితులు మండిపడుతున్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం బ్యాంకు ఖాతాల్లో జమచేస్తేగానీ భూములు ఇవ్వబోమని బాధితులు ముక్తకంఠంతో చెబుతున్నారు.

వంద అడుగుల రోడ్డు విస్తరణలో పోతున్న భూమి, స్థలాన్ని ధ్రువీకరిస్తూ యజమానుల పేరిట 2022 ఆగస్టులో అనకాపల్లి ఆర్‌డిఒ వ్యక్తిగత నోటీసులు జారీచేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం విలువ కట్టి నగదు చెల్లిస్తామని బాధితులకు వివరించారు. వంద అడుగులకు సరిపడా హరిపాలెం, కొన్ని గ్రామాల్లో మార్క్ చేశారు. టిడిఆర్‌లను బాధితులు వ్యతిరేకించడంతో గ్రామసభలు నిర్వహించి బాధితుల కోపం చల్లార్చే ప్రయత్నంలో అధికారులున్నారు.

ప్రకృతి విపత్తులపై మాక్ డ్రిల్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రకృతి విపత్తులు, అనుకోని ప్రమాద ఘటనలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై అవగాహన కల్పిస్తూ జిల్లా ప్రకృతి విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యాన బుధవారం మహారాణిపేట పరిధి జబర్‌తోట వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. సునామీ, తుపాన్లు, భూకంపాలు, అగ్ని ప్రమాదాల సమయంలో ఎలా వ్యవహరించాలో డిపిఎం కళావతి సమక్షంలో ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌టిఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక, పోలీసు, జివిఎంసి, రెవెన్యూ, వైద్యారోగ్య, ఆర్ అండ్ బి, పరిశ్రమలు, సివిల్ సప్లైస్, పశుసంవర్ధక, ఇపిడిసిఎల్, నీటి సరఫరా, పొల్యూషన్, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు.

విద్యుత్ ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించొద్దని డిమాండ్ చేస్తూ ఈ నెల 12వ తేదీన విశాఖలోని ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని 5 జిల్లాల కార్మికులతో కలిసి అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌చంద్రశేఖర్‌తో కలిసి బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆర్‌కెఎస్‌వి.కుమర్ మాట్లాడుతూ, విద్యుత్ రంగంలో ప్రయివేటు, కాంట్రాక్టు, పీస్ రేట్ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. పిఆర్‌సిలో జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు తెచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని, వారికి ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులందరినీ విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరశురామ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏప్రిల్ 12న జరిగే విద్యుత్ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సుకు పర్మినెంట్, కాంట్రాక్ట్, పీస్ రేట్ ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్ తదితరులు

మినీ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : మినీ బాలోత్సవం పోస్టర్‌ను అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. ఆసరా ఛారిటబుల్ సొసైటీ వార్షిక సాధారణ సమావేశం సందర్భంగా వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్‌తో సంయుక్తంగా ఈ నెల 24వ తేదీన అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మినీ బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆసరా ప్రెసిడెంట్ సి.సునీత తెలిపారు. ఆసరా గడచిన మూడేళ్లుగా విసిసి ద్వారా నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్లు, క్లబ్ విద్యార్థులకు అకడమిక్, కల్చరల్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసరా వార్షిక సమావేశం సందర్భంగా బాలోత్సం నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

విసిసి జిల్లా కన్వీనర్ కె.సుశీల మాట్లాడుతూ సబ్ జూనియర్స్ ఎల్‌కెజి నుంచి రెండవ తరగతి, జూనియర్స్ 3 నుంచి 5వ తరగతి, సీనియర్స్ 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. చిత్ర లేఖనం, కథ చెప్పటం, మెమరీ టెస్ట్, ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్, బృందగానం, జానపద బృంద నృత్యం, బృంద నృత్యం, లఘు నాటిక, ఏకపాత్రాభినయం, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్, వ్యాసరచన, క్విజ్ వివిధ కేటగిరీలలో పోటీలు జరుగుతాయని వివరించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్, విజేతలకు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసరా కమిటీ సభ్యులు శ్రీనాద్, విసిసి కో-ఆర్డినేటరు సతీష్, ఆర్గనైజర్లు కల్యాణి, భవాని, మణి, రమాదేవి, అనూరాధ పాల్గొన్నారు.


మినీ బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆసరా, విసిసి ప్రతినిధులు



సత్కార సభలో మాట్లాడుతున్న చెరువు రామకోటయ్య

కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి


ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్‌లోని కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించేందుకు పూర్తి కృషి చేస్తానని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ట్రస్టీగా నియమితులైన చెరువు రామకోటయ్య చెప్పారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రీజియన్ ట్రస్టీగా చెరువు రామకోటయ్య నియమితులైన సందర్భంగా ఆయన్ను బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం పాలకవర్గం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా రామకోటయ్య మాట్లాడుతూ, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం చాప్టర్‌కు అధ్యక్షుడు గాను, జాతీయ కౌన్సిల్ సభ్యుడుగాను, రాష్ట్ర అధ్యక్షులుగా, జాతీయ ఉపాధ్యక్ష్యులుగా, పలు జాతీయ కమిటీలలో అధ్యక్షులుగా గత 30 సంవత్సరాలుగా సేవలందించిన తనకు 2025-27 సంవత్సరానికి ఈ నూతన కమిటీలో ట్రస్టీగా అవకాశం కల్పించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిఎఐ చైర్మన్ సిహెచ్ నవనీత్, కార్యదర్శి ఎంఎన్.మూర్తి, కోశాధికారి జివి.సుబ్బారావు, ఐఎంఎం పూర్వ అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, ఆర్.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.కుమార్ రాజా పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన ప్లాట్లను ఆరునెలల్లో అందజేస్తాం

- భూనిర్వాసిత రైతులకు ఎమ్మెల్యే గంటా స్పష్టీకరణ
- జి.అగ్రహారం లేఅవుట్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని రామవరం పంచాయతీ, గంగసాని అగ్రహారంలో వీఎంఆర్‌డిఎ అభివృద్ధి చేస్తున్న ప్లాట్లను నిర్వాసిత రైతులకు ఆరునెలల్లో అందజేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం వీఎంఆర్‌డిఎ. అభివృద్ధి చేయనున్న గంగసాని అగ్రహారం లేఅవుట్ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైతుల సమస్యను రెండ్రోజుల్లో పరిష్కరించామన్నారు. 2016లో వీఎంఆర్‌డిఎ సేకరించిన 245 ఎకరాల్లో భూనిర్వాసి తులకు మొదటి విడతగా 85 ఎకరాల్లో అన్ని హంగులతో లేఅవుట్ సిద్ధం చేస్తున్నామన్నారు. ఆయా లేఅవుట్‌కు జాతీయ రహదారి నుంచి 80 అడుగుల రోడ్డు కావాలన్న రైతుల కోరిక నెరవేరుతుందన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్, గచ్చిబౌలి మాదిరిగా విశాఖలో ఆనందపురం ప్రాంతం శరవేగంతో అభివృద్ధి చెందుతోందని, తర్లువాడ సమీపంలో 200 ఎకరాల్లో ఐటి పరిశ్రమను అభివృద్ధి చేసి, 10 వేల నుంచి 15 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వీఎంఆర్‌డిఎ. కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ భూములిచ్చిన రైతులకు నెల రోజుల్లో ఎల్‌పిసిలు అందజేసి, తర్వాత 20 రోజుల్లో ప్లాట్లు రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం : జివిఎంసి 3,4 వార్డుల్లో రూ3.62 కోట్లతో పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధ వారం శంకుస్థాపన చేశారు. దొరతోట నుంచి కెజిబివి వరకు రూ 1.91 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు, బాలాజీ హేచ నుంచి కె నగరపాలెం పరదేశమ్మ ఆలయంవరకు రూ.18.35 లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనుల కు శంకుస్థాపన చేశారు. కె నగరపాలెం పంచాంయతీ కార్యాలయం, పెద ఉప్పాడ, టాస్ పార్క్ కాలనీ తదితర ప్రాంతాల్లో రూ కోటితో డ్రెయిన్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు ఉన్నాయని, గొల్లల తిమ్మాపురంలో రూ 49 లక్షలతో కల్యాణ మండపం నిర్మించనున్నట్లు తెలిపారు. వీఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారామ్, రామవరం సర్పంచ్ ఎర్ర రాజు, రామా నాయుడు, కె.శ్రీకాంత్‌వర్మ, ఘట్టమనేని సుభాష్ చంద్ర బోస్, జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్నవాణి, టిడిపి నేతలుగంటా నూకరాజు, పాసి నరసింగరావు పాల్గొన్నారు

మెరుగైన వైద్యసేవలు అందించండి

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రజలకు అందుబాటులో ఉండి ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా వైద్యసేవలను అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం రంగరాజువీధి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఎన్‌సిడి 3.0, అభ ఐడి జనరేషన్ వంటి ఆరోగ్య కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. స్థానిక వైద్యులు, సిబ్బందితో యుపిహెచ్‌సిలో సేవలపై సమీక్షించారు. ఇన్, అవుట్ పేషెంట్లు, వ్యాధినిర్ధారణ పరీక్షలు, ఆసుపత్రి ప్రసవాలు, ఎన్‌సిడిసిడి సర్వే, ఆర్‌సిహెచ్ రిజిస్ట్రేషన్స్, కెపిఐ ఇండికేటర్స్‌పై వైధ్యాదికారులకు సూచనలు చేసారు. గర్భిణులు, చిన్నపిల్లలు, ఇతరత్రా వ్యాక్సినేషన్ క్రమబద్ధంగా జరగాలని సూచించారు. ఆశా కార్యకర్తల విధులను పర్యవేక్షించి, గర్భిణులకు రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలతోపాటు, పౌష్టికాహారం సరిగా తీసుకునేలా సూచనలు చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


ప్రజాశక్తి-మధురవాడ :పిఎం.పాలెంలోని ఆళ్వార్‌దాస్ టెక్నికల్ క్యాంపస్‌లోని సాంకేతిక విద్యాపరిషత్ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీలు, శ్రీనివాసరావు కాలేజీ అఫ్ ఫార్మసీ సంయుక్త ఆధ్వర్యాన స్థానిక క్రికెట్ స్టేడియం వద్ద చలివేంద్రాన్ని బుధవారం ఆళ్వార్‌దాస్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంకరి రాహుల్ ఆళ్వార్‌దాస్ ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు తమ విద్యాసంస్థల ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆళ్వార్ దాస్ గ్రూప్ సెక్రటరీ, కరెస్పాండంట్ డాక్టర్. ఎస్‌విహెచ్. రాజేంద్ర, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధు భాట్, అడ్మిషన్స్ ఆఫీసర్, కోఆర్డినేటర్ ఏ.నాగేశ్వరరావు, హెచ్‌ఆర్ అండ్ సీఆర్‌ఎం అక్షత కొండూర్, క్రియేటివ్ డైరెక్టర్ విష్ణు కొండూర్, సంస్థ అకడమిక్ డైరెక్టర్ వి. శివరాం ప్రసాద్, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్. టివి. రామకృష్ణ, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్యుత్‌కుమార్, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ ఎ.రామకృష్ణ, డాక్టర్ ఎం.మాధురిపాల్గొన్నారు.

ప్రభాస సాహిత్యం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- సీతమ్మధార: ప్రభాస భారతి రచయితల సాహితీ సృజనలపై రచయిత రమేష్ ప్రసాద్ రావెల్ల చేసిన విమర్శాత్మక రచనలు చాలా అద్భుతంగా ఉన్నాయని విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షులు డాక్టర్ రఘురామారావు కొనియాడారు. బుధవారం విశాఖ సంస్కృతి మాసపత్రిక ఆధ్వర్యంలో సన్యాసిరావు అధ్యక్షతన, డాక్టర్ రమేష్ ప్రసాద్ రచించిన ప్రభాస సాహిత్యం పుస్తకావిష్కరణ సభ ఈ సందర్భంగా రఘురామారావు మాట్లాడుతూ ఈ పుస్తకం చదివితే ప్రపంచంలోని విభిన్న వర్గాల ప్రజలు జీవనశైలి ఆలోచన ధోరణులు అవగతమౌతాయన్నారు. డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ రచయిత రమేష్ ప్రసాద్‌కు కంప్యూటర్ సైన్స్ ఫిజిక్స్ అంశాల్లో ఎంత అనుభవం ఉందో సాహిత్యంలో కూడా అంతటి గొప్ప ప్రావీణ్యం ఉందని కొనియాడారు. పుస్తక రచయిత రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ సాహిత్య విమర్శ చేయడం అంత సులువైన పని కాదన్నారు.

సిఎం సహాయనిధి సాయం అందజేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : నియోజక వర్గం పరిధిలోని ఏడుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ 15.91లక్షల నగదుసాయం చెక్కులను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేశారు. బుధవారం విశాఖ ఎంవిపి కాలనీలోని తన నివాసంలో ఒకటో వార్డు తగరపువలసకు చెందిన మాదాబత్తుల ఉమాకృష్ణవేణికి రూ 2,02,274, మీసాల ప్రసాద్‌కు రూ 40,199, ఆనందపురం మండల కేంద్రానికి చెందిన శెట్టి ఎర్రి నాయుడుకు రూ.1,65,578, చందక గ్రామానికి చెందిన లొడగల జాస్మిన్ విజయ్ యాదవ్‌కు రూ 1,00, 859, ఐదోవార్డుకు చెందిన శ రగడం నిహారికకు రూ 44,406 8వ వార్డుకు చెందిన జక్కంపూడి రేణుక కుమారునికి రూ 5,01,576 , గడ్డం ప్రణీత్ కు రూ 5,36, 190 చెక్కులను ఎమ్మెల్యే గంటా అందజేశారు. కార్యక్రమంలో ఆయా వార్డులు, గ్రామాల టిడిపి నాయకులు తమ్మిన సూరిబాబు, పిట్ట సురేష్, కొప్పల రమేష్, పి అప్పలరాజు, అంగటి రాము, ఎం.సత్యనారాయణ, మొల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుఅందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పైనాపిల్ కాలనీకి చెందిన శివకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.20వేల నగదు సాయం చెక్కును తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అందజేశారు. కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు పొత్రకండ ధర్మారావు, యల్లమిల్లి సురేష్, మసబట్టుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 48వ వార్డులో రూ.53 లక్షలతో పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు బుధవారం శంకుస్థాపన చేశారు

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతోపాటు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గంకల కవిత, జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులు వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్, కూటమి నేతలు పాల్గొన్నారు

గెడ్డల్లో పేరుకుపోయిన చెత్త

దుర్వాసన, దోమలతో జనం పరేషాన్ : పట్టించుకోని జివిఎంసి యంత్రాంగం



25వ వార్డులో గెడ్డలో నిండి ఉన్న చెత్త, వ్యర్థాలు



ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డులోని పలు ప్రాంతాల్లో గెడ్డల్లో పేరుకుపోయిన చెత్తతో ప్రజలన నానా ఇబ్బందులకు గురౌతున్నారు. బివికె కాలేజీ పక్కన ఉన్న గెడ్డలో చెత్త నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ, విద్యార్థులతోపాటు అటుగా వెళ్లేవారంతా అవస్థలు పడే పరిస్థితి ఉంది.. సీతంపేట బనియన్ ట్రీ పక్కనున్న గెడ్డలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. నగరంలో పందులు ఉండకూడదని చెబుతున్న జివిఎంసి అధికారులకు ఇవి కనిపించడం లేదాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాక ఈ గెడ్డలో పేరుకుపోయిన చెత్త మురిగిపోయి దుర్వాసన వెదజల్లడంతో అక్కడ ఫుట్‌పాత్‌పై వెళ్లే పాదచారులతోపాటు అటుగా వెళ్లే వాహన దారులు ముక్కు మూసుకోక తప్పడం లేదు క్రోన్ బేకరీ పక్కనున్న గెడ్డలోనూ అదే పరిస్థితి. ఈ వ ా ం గ ం లో దేవాలయానికి నిత్యం ఎక్కువ సంఖ్యలో భక్తులు వెళు తుంటారని, వారంతా ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని వాపోతున్నారు. గెడ్డల్లో పేరుకుపోయిన చెత్తతో దుర్వాసనతోపాటు దోమలు విజృంభించి రోగాల బారిన పడే ప్రమాదముందని ఆందోళన చెందుతున్న స్థానికులు, వెంటనే వీటిని శుభ్రం చేయాలని కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ : యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆరిలోవ కాలనీ, రాజేంద్రనగర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల రోజుల క్రితమే 12వ వార్డు ఆరిలోవ కాలనీ, రాజేంద్రనగర్‌లో మచ్చా రాము అనే యువకుడు ఒక ఇంటిని అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. ఇటీవలే తన తల్లి మృతి చెందింది. బుధవారం యువకుడు నివాసముంటున్న ఇంటి నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసులు వచ్చి తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు.రాము మృతి చెంది మూడురోజులు కావొచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. ఎస్ఐ రామదాసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



మాట్లాడుతున్న సిఐ వాసునాయుడు, బియ్యంతో పట్టుబడిన వ్యాన్

ప్రజాశక్తి- ఆనందపురం: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని బుధవారం తెల్లవారుజామున భీమిలి క్రాస్ రోడ్డు చెక్ పోస్ట్ వద్ద స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఆనందపురం సిఐ చింతా వాసునాయుడు, సిఎస్‌డిటి శ్రీనివాసరావు అందించిన వివరాలివి.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం విశాఖపట్నం నుండి ఆనందపురం వైపు వస్తున్న ఎపి 39 యుటి 4180 బొలోరో వ్యాన్ తనిఖీ చేయగా, నాలుగు టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు ఈ బియ్యాన్ని కిలో బియ్యం రూ.పది చొప్పున కొనుగోలు చేసి ఆనందపురం పరిసర ప్రాంతాల్లో విక్రయించనున్నట్లు వ్యాన్ డ్రైవర్ తెలిపారు. సిఎస్‌డిటి శ్రీనివాసరావు సమక్షంలో రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి, పౌరసరఫరాల అధికారులకు అందజేసినట్లు సిఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసు నాయుడు తెలిపారు

సిపిఐ జిల్లా మహాసభ జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మధురవాడ : వచ్చేనెల 10,11 తేదీలలో విశాఖలో నిర్వహించే సిపిఐ విశాఖ జిల్లా మహాసభను జయప్రదం చెయ్యాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు కోరారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయం పిఎస్‌ఆర్ భవనంలో కొల్లి మేఘూరావు అధ్యక్షతన జరిగిన ఏరియా సమితి సమావేశంలో మాట్లాడుతూ మాట్లాడుతూ మూడోసారి ప్రధాని పీఠం అధిరోహించిన మోడీ, రాజ్యాంగం స్ఫూర్తికి వ్యతిరేకంగా మతపరమైన అంశాలను టార్గెట్: చేసి ప్రజల్లో విద్వేషాలను సృష్టిస్తున్నారన్నారు. రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నా, వక్స్ బోర్డుకు సవరణలు చేసి కొత్త చట్టం తేవడం ఇందులో భాగమేనన్నారు. సమావేశంలో ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, బి కేశవయ్య, ఎం ఎస్ పాత్రుడు, కె అరుణ్ కుమార్, జి వేళంగినిరావు, అబ్దుల్ అక్బర్, నూలు త్రినాధ్, డి సతీష్, కె చిన్న, పి సూరిబాబు, ఎన్ అప్పారావు, ఎం బంగారయ్య పాల్గొన్నారు.

ములగాడ : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిపోయిందని సిపిఐ నేతలు ఆక్షేపించారు. బుధవారం జి.రమణమ్మ అధ్యక్షతన శ్రీహరిపురం శాఖ మహాసభలో విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు, శాఖ కార్యదర్శి గండి అప్పారావు పాల్గొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. కార్యక్రమంలో జి అప్పలరెడ్డి, చంద్రశేఖర్, ప్రకాష్, బి సత్యవతి, శ్రీలక్ష్మి, వై లక్ష్మి, కె.పార్వతి పాల్గొన్నారు.

'అన్ని అనుమతులున్నా ఆటంకాలు'

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కుమ్మరిపాలెం, వలంద భూములు ప్రాంతంలోని తమ స్థలంలో అన్ని అనుమతులతో అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్న తమకు కొంతమంది ఉద్దేశ్యపూర్వకంగా ఆటంకాలు కల్పిస్తున్నారని అపార్ట్‌మెంట్ యజమానులు అంబటి శంకరరావు, బలభద్రుని చెన్నయ్య చెట్టి తెలిపారు. బుధవారం స్థానిక చిన్న బజారులో విలేకర్లతో మాట్లాడుతూ, జివిఎంసి, ఇతరత్రా అన్ని అనుమతులతో చేపడుతున్న నిర్మాణాలకు ఆటంకం సృష్టించి, ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కుళాయిల్లో మురుగునీరు!

ఇబ్బందులు పడుతున్న గంధవరం గ్రామస్తులు : పట్టించుకోని అధికారులు



పైపులైన్ రంధ్రంలోంచి బయటకు వస్తున్న రంగుమారిన నీరు

ప్రజాశక్తి -పద్మనాభం.: మండలంలోని గంధవరం గ్రామపంచాయతీలో కుళాయిల్లో మురుగునీరు రావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నాళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా సంబంధిత పంచాయతీగానీ, అధికారులుగానీ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. గ్రామంలోని జనాభా అవసరాలకు తగ్గట్టుగా తాగునీరు అందుబాటులో లేదని, ఇపుడు కుళాయిల్లో వచ్చే మురుగునీరు ఇంట్లో అంట్లు తోముకోవడానికి కూడాపనికిరాని విధంగా ఉంటున్నాయని వాపోతున్నారు. ప్రస్తుతం వేసవి సీజన్ ప్రారంభం కావడం, మండుతున్న ఎండలతో నీటి అవసరాలు పెరిగిన నేపథ్యంలో కుళాయిల ద్వారా వస్తున్న మురుగునీటితో అవసరాలు తీర్చుకునేదెలాగని ప్రజలు సతమతమ మౌతున్నారు. ఈ నెల 13న గ్రామంలో పైడితల్లమ్మ పండుగ జరగనున్న నేపథ్యంలో గ్రామానికి బంధు మిత్రులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున నీటి కష్టాల నుంచి గట్టెక్కడమెలాగని ఇప్పటినుంచే స్థానికులు తలలు పట్టుకుంటున్నారు. అధికారులు స్పందించి, కుళాయిల్లో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నతమైన జీవనం

• నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ



నవసమాజ నిర్మాణ కార్యక్రమంలో విద్యార్థులతో సిపి బాగ్చీ

ప్రజాశక్తి- వేపగుంట: జీవితంలో ఉన్నతస్థాయికి వెళ్లాలంటే క్రమశిక్షణ అవసరమనినగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. బుధవారం నరవలోని విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో నవసమాజ నిర్మాణ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ, సోషల్ మీడియా మోసాలు, బెట్టింగ్ యాప్స్, చెడువ్యసనాలపై వివరించి, వాటికి దూరంగా ఉండాలని హితవు పలికారు. డ్రగ్స్ అనర్థాలు, ఆర్థికనేరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జోన్ 2 డిసిపి డి మేరీ ప్రశాంతి, వెస్ట్ ఎసిపి ఎ.బి.పృథ్వీతేజ, పెందుర్తి సిఐ కెవి సతీష్‌కుమార్, కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, డాక్టర్ జి.వి.ప్రదీప్ వర్మ వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ కలయిక



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ 1975-76 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం బిసి రోడ్డులోని ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. 50ఏళ్లపూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు జరుపుకున్నారు.. ఇంతకుముందు 2019లో తొలిసారి అప్పట్లో ఇదే బ్యాచ్‌కు చెందిన 80 మంది పూర్వ విద్యార్థులు కలుసుకుని సందడి చేయగా, తాజాగా మరోసారి కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు, పరస్పర యోగక్షేమ సమాచారాలను తెలుసుకున్న వారంతా, నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా రోజంతా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గానాల బ్రహ్మం, ఉడా వెంకట శ్రీనివాసరావు (కొండబాబు), బోయి పెరిరెడ్డి, వై. ఈశ్వరరావు, జీలకర్ర రమణ, కుంచరావు, వై.తాతారావు, దేవి పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, నేతలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక, పెదగంట్యాడ. వర్తక సంఘం అధ్యక్షులుగా తిప్పల చిన్నఅప్పారావు విశేషసేవలు అందించారని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కొనియాడారు. బుధవారం తిప్పల చిన్న అప్పారావు 5వ వర్ధంతిని పురస్కరించుకొని పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న గాజువాక, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి మాట్లాడుతూ, గాజువాక ప్రాంతాలో చిన్నఅప్పారావు చేసిన సేవలు స్థానిక ప్రజల్లో చిరస్మరణీయంగా ఉండిపోయాయన్నారు.కార్యక్రమంలో పెద్దిరెడ్డి, గాజువాక వర్తకసంఘం గౌరవాధ్యక్షులు తిప్పల నిలీష్‌రెడ్డి, పెదగంట్యాడ, ఆటోనగర్ కళాసీల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఐఆర్ హామీని అమలు చేయాలి : యుటిఎఫ్



మాట్లాడుతున్న యుటిఎఫ్ నేత నాగేశ్వరరావు

ప్రజాశక్తి- గాజువాక : ఉపాధ్యాయులకు తక్షణమే డిఎ చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం గాజువాక సిఐటియు కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 29శాతం ఇంటిరియం రిలీఫ్ (ఐఆర్) ఇవ్వాలని కోరారు. ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా విద్యార్థుల నమోదు పెంచేందుకు యుటిఎఫ్ నేతలు, కార్యకర్తలు ఇప్పటినుంచే ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు టి. అప్పారావు, మహ్మద్ రిజ్వాన్, ఎం. రవిబాబు, పెద గంట్యాడ ప్రధాన కార్యదర్శి సూరిబాబు, గాజువాక అధ్యక్షులు ఎస్‌వి. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు, ఎస్. శ్రీనివాస్ రాజు, డి.నూకరాజు, ఎ. రవిబాబు, ఎస్.అవరంది, ఎ. విజయకుమారి, బి. సువర్ణలత, ఎం. అనితకుమారి, కె.మహిమరావు స్థానిక సిఐటియు నేతలు ఎం.రాంబాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎస్‌వికె.పరశరాం పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటును నిరసిస్తూ ఆందోళన



యాతపేటలో ఆందోళన చేస్తున్న మహిళలు, మద్దతుగా సిపిఎం నేతలు

ప్రజాశక్తి -తగరపువలస :జివిఎంసి ఒకటోవార్డు తగరపువలస, బాలాజీనగర్, యాతపేట సమీపంలో సెల్ టవర్ ఏర్పాటును నిరసిస్తూ బుధవారం సాయంత్రం స్థానికులు సెల్‌టవర్ స్థలంలో ఆందోళన చేశారు. ఆందోళనకు సిపిఎం భీమిలి జోన్ కమిటీ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, నాయకులు ఎస్ అప్పల నాయుడు, పంపాన సూర్యనారాయణ, సిఐటియు నాయకులు రీసు నరసింగరావు మద్దతుగా నిలిచారు. సెల్ టవర్ ఏర్పాటు యత్నాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లాజిస్టిక్ రంగంలో అపార ఉద్యోగావకాశాలు

• గీతం సదస్సులో నిపుణుల వెల్లడి



సదస్సులో పాల్గొన్న నిపుణులతో గీతం ప్రతినిధులు, విద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ : లాజిస్టిక్స్, ఆపరేషన్ రంగంలో అపార ఉద్యోగావకాశాలు ఉన్నాయని అవాన్ ఇంటలెక్ట్ సంస్థ అధ్యక్షుడు దేవ్‌సింగ్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (ఇండియా) బబ్లు తివారి, ప్రొఫెసర్ కార్తికేయన్ అన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో లాజిస్టిక్స్, ఆపరేషన్ అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు అధ్యక్షత వహించిన సదస్సులో నిపుణులు మాట్లాడుతూ, పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా, కాలానుగుణంగా నైపుణ్యాలను విస్తృత పరుచుకోవాలని సూచించారు .గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు మాట్లాడుతూ, పరిశ్రమలకు విద్యాసంస్థలకు మధ్య బలమైన సంబంధాల ద్వారా దేశానికి అవసరమైన మానవ వనరులను నైపుణ్యాలతో సిద్ధం చేయవచ్చునని అభిప్రాయపడ్డారు విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు నిపుణులు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్ సాయి సుధాకర్, ఆపరేషన్, సప్లై విభాగం చైర్మన్ డాక్టర్ వైఎల్‌పి.తరణి పాల్గొన్నారు.

4నఐఐటి, మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని ఆర్ తాళ్లవలస తిరుమల విద్యాసంస్థల క్యాంపస్ లో ఈ నెల 4న ఉదయం 10 గంటలకు ఐఐటి, మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సదస్సులో పాల్గొనవచ్చన్నారు. ఇంటర్‌తో పాటు జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్, ఐఐటి ఎన్ఐటి, ట్రిపుల్ ఐటి, బిట్స్ వంటి సంస్థల్లో సీటు సంపాదించాలంటే సన్నద్ధతపై సదస్సులో వివరిస్తామని తెలిపారు ఈ అవకాశాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు

11 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : 2025 -26 ఆర్థిక సంవత్సరానికి ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు ఈనెల 11 నుంచి వచ్చేనెల 20లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఎంపిడిఒ ఎస్ హనుమంతరావు బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔషధ దుకాణం, మెడికల్ ల్యాబ్, ఎలక్ట్రికల్ బ్యాటరీ ఛార్జింగ్ యూనిట్, ఎలక్ట్రిక్ ఆటో, నాలుగు చక్రాల ప్యాసింజర్ కారు, గూడ్స్ ట్రక్ తదితర యూనిట్లకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.

నేటి నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఈ నెల 3 నుంచి 28 వరకు తమ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ తెలిపారు.పరీక్ష కోర్సు మెటీరియల్ ఉచితంగా ఇస్తామని, ఈ అవకాశాన్ని టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు వినియోగించు కోవాలన్నారు.ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 .30 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసిన వారు మాత్రమే శిక్షణకు అర్హులన్నారు

'అన్నదానానికి బియ్యం బస్తాలిస్తాం'

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు నుంచి 13వ వార్డు పరిధిలోని శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించే కమిటీలు అన్నసమారాధనలు నిర్వహిస్తే వారికి వి జ్యూయలరీ మార్ట్ సహకారంతో ఉచితంగా నాలుగేసి బియ్యం బస్తాలను అందజేస్తామని శ్రీరాముల దేముడు ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకి గంగరాజు (క్యాటరింగ్ రాజు) ఒక ప్రకటనలో తెలిపారు. అన్నప్రసాద వితరణ చేపట్టే ఉత్సవ కమిటీలు సంబంధిత కరపత్రం , ఆహ్వానపత్రంతో తమను సంప్రదిస్తే వారు కోరిన చోటుకు ఉచితంగా బియ్యం బస్తాలను అందజేస్తామన్నారు. ఆయా వార్డుల పరిధిలోని అన్ని ఉత్సవ కమిటీలు తమను సంప్రదించాలని కోరారు. వివరాలకు 95505 78107 ఫోన్ నెంబరుకు సంప్రదించాలని కోరారు.. తమ ట్రస్ట్ తరపున అన్ని మతాలకు సమప్రాధాన్యత ఉంటుందని ఇటీవల రంజాన్ సందర్భంగా ముస్లిములకు పండ్లు అందజేశామన్నారు.

పి4 సేవలలో బిసిలకు

50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

ప్రజాశక్తి- మాధవధార : పి4 సేవలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయ్యాలని పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకట్రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పి4 కార్యక్రమంలోని ముఖ్యాంశాలు కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలులోనివేనన్నారు. దేశంలో టాప్ 500 కంపెనీలు కోటి మంది పేదలకు ఉపాధి చూపాలని ప్రధాని మోడీ ఆయా కంపెనీ యాజమాన్యాలకు నిర్దేశించడంతో ఆ కార్యక్రమం కేంద్ర స్థాయిలో ఇప్పటికే కొనసాగుతుందని వెల్లడించారు. దాతృత్వంతో సమాజం మారదని, పేదరికం తగ్గాలంటే పేదల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచాల్సి ఉందన్నారు. ఇటీవల గ్రామాల్లో చేపట్టిన నైపుణ్య సర్వేలో గుర్తించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయా రంగాలలో వారిని ప్రోత్సహించాలని కోరారు. పి 4 సర్వేలో అందరి సలహాలు సూచనలు తీసుకోవాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాన్ని స్వాగతించారు.

ప్రజాసమస్యలపై సిపిఎం నిరంతరం పోరాటం

జాతీయ మహాసభలు సందర్భంగా జెండా ఆవిష్కరణలు


మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు పద్మనాభరాజు



జెండాను ఆవిష్కరించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- మాధవధార

ప్రజాసమస్యలపై పోరాటంలో సిపిఎం ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ పార్టీ సీనియర్ నేత వివిఎస్.పద్మనాభరాజు అన్నారు. ఈనెల2 నుంచి 6వరకు తమిళనాడులోని మధురైలో సిపిఎం అఖిల భారత మహాసభల నేపథ్యంలో బుధవారం మాధవధారలో మాధవ యువజన సమాజం ఆవరణలో సిపిఎం నాయకురాలు కూన పార్వతి అధ్యక్షతన పార్టీ జెండాను పద్మనాభరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ధరలు, ఛార్జీల భారం తగ్గించాలని, నిరుద్యోగ సమస్యపై ఇలా అన్ని వర్గాల ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడే స్పందిస్తూ ఎర్రజెండా నీడన సిపిఎం పోరాటాలు చేస్తోందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తూ పోరాటాలు చేస్తోందన్నారు. మధురైలో జరుగుతున్న కార్మిక, కర్షక, అన్నివర్గాల ప్రజల పండుగ, సిపిఎం 24వ జాతీయ మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు అమ్ములమ్మ, జనార్ధనమ్మ, సీతమ్మ, చిలకమ్మ, అనూరాధ, భవాని, కె.సుధాకర్, ఎస్.రామ్‌గోపాలరావు, కూన వెంకటరావు, కూన సత్యనారాయణ, నాయుడుబాబు, జివిఎన్.మూర్తి, శంకరరావు, శ్రావణ్, మూర్తి, వరహాలు, నర్సింగరావు, రవి, శ్రీను, అప్పారావు, పార్టీ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : మధురైలో జరుగుతున్న సీపీఎం 24వ అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం నర్సీపట్నం సీపీఎం కార్యాలయం వద్ద పార్టీ సీనియర్ నాయకులు ఎల్.గౌరి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ, ఈ మహాసభలో బిజెపి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపైనా, నిరుద్యోగ సమస్య, పంటలకు గిట్టుబాటు ధరలు, కార్మికులకు కనీస వేతనాలు, ధరలు పెరుగుదల, దళితులు, గిరిజనులు, మహిళలు, మైనారిటీలపై జరుగుతున్న దాడులు, మతోన్మాద ప్రమాదం వంటి సమస్యలపై చర్చించి రాబోయే మూడు సంవత్సరాల్లో పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈరెల్లి చిరంజీవి, కేవి.సూర్యప్రభ, ఎస్.నాగరమణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : సిపిఎం అఖిలభారత మహాసభలు జయప్రదం కావాలని కోరుతూ మండలంలోని హరిపాలెం గ్రామంలో బుధవారం పార్టీ సీనియర్ నాయకులు కె.రామసదాశివరావు పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ ఆర్ రాము, సీనియర్ నాయకులు కర్రి అప్పారావు మాట్లాడుతూ చివరి రోజున మధురైలో జరుగు భారీ బహిరంగ సభలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరిపాలెం శాఖ కార్యదర్శి బి.రామ్‌కుమార్, సీనియర్ నాయకులు బుద్ధ రంగారావు, మండల కమిటీ సభ్యులు కె.సోమునాయుడు, నాగేశ్వరరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.


జెండాను సెల్యూట్ చేస్తున్న సిపిఎం నేతలు


ఉద్యోగ విరమణ చేసిన కుమారి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఉద్యోగ విరమణ ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని కొత్తూరు ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలు డిఎస్‌బి.కుమారి ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు కుమారి సేవలు ఆదర్శప్రాయమన్నారు. అనంతరం హెచ్ఎం కుమారి దంపతులకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.పద్మజ, ఎంఈఓలు లక్ష్మణరావు, రవీంద్రబాబు, యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు పి.తమ్మారావు, కెవి రమణ, పిఆర్‌టియూ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అప్పల నాయుడు, భాస్కరరావు, ఏపిటిఎఫ్ అధ్యక్షులు రెడ్డి ప్రసాదరావు, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలిసెట్-2025కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : పాలిసెట్-2025 పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ బివిఎస్ఎస్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత అనుభవజ్ఞులైన పాలిటెక్నిక్ లెక్చరర్స్‌చే ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహింపబడుతుందన్నారు. పాలిసెట్- 2025 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిక్షణా తరగతులు ఈ నెల 3వ తేదీ నుండి ప్రారంభమవుతాయని, ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుండి 12.30 గంటల వరకు కళాశాలలోని బ్లాక్-3లో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తికల విద్యార్థులు 9398848767, 8919790483 ఫోన్ నెంబర్లలో సంప్రదించి వివరాలు తెలుకోవాలని కోరారు.

సీతారాముల కల్యాణ రాట మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లిరూరల్ : శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా అనకాపల్లి దేమునిగుమ్మం శ్రీసీతారాముల ఆలయంలో రాముల వారి కల్యాణ రాటను బుధవారం వేశారు. దేవాలయం కార్యదర్శి బొలిశెట్టి శ్రీనివాసరావు కళ్యాణ మహోత్సవ వివరాలు తెలియజేశారు. ఈ నెల 4న శుక్రవారం ఉదయం 9 గంటలకు మూలవిరాట్లకు సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో క్షీరాభిషేకం, 6వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు ఉత్సవమూర్తులను పురవీధులలో ఊరేగింపు, 11.30కు కళ్యాణం, మధ్యాహ్నం 12:30 నుండి అన్న సమారాధన, సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక భజన తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీరామదాసు గోవిందరావు, సుంకర రామకృష్ణ, మహదాసు వెంకట లోవరాజు, చందనాల వరప్రసాద్, కేలం రామారావు, గేదల వెంకటరావు, కొసిరెడ్డి సూరిబాబు, బోడాల వేణుగోపాల్, కల్యూరి శ్రీనివాసరావు, గోలి మురళి, తిమ్మాపాత్రుని గణేష్, తాళపురెడ్డి శ్రీనివాసరావు, దేవాలయం అర్చకులు అయ్యల సోమయాజుల శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మిడతాడ కుటుంబానికి బండారు పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు కుటుంబాన్ని మాజీ మంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బుధవారం పరామర్శించారు. మహాలక్ష్మినాయుడు సోదరుడు మిడతాడ అప్పలనాయుడు (బుర్రకథ అప్పలనాయుడు) మార్చి 30న మృతి చెందారు. విషయం తెలుసుకున్న బండారు సత్యనారాయణమూర్తి అంతకాపల్లి వెళ్లి మహాలక్ష్మి నాయుడు సోదరుడు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దొంగలి దేముడు బాబు, బోకం జోగినాయుడు, లాలం సింహాచలం నాయుడు, సబ్బవరపు నాయుడు, సబ్బవరపు నరసింహమూర్తి, కిల్లి సత్యనారాయణ, బోకం శ్రీనివాసరావు, వనం సూర్యనారాయణ, అంతకాపల్లి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవల్లో జాప్యం ఉండకూడదు : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : రెవెన్యూకు సంబంధించిన సేవలలో జాప్యం ఉండకూడదని, వాటి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరం నుండి రెవిన్యూ శాఖకు సంబంధించిన రీసర్వే, మ్యుటేషన్లు, ఇంటిస్థలాలు క్రమబద్ధీకరణ, నీటితీరువా వసూలు తదితర అంశాలపై తహశీల్దార్లతో జిల్లా కలెక్టరు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని మండలాలలో ఆటో మ్యుటేషన్లు పెరగడం, ఎక్కువ మ్యుటేషన్లను తిరస్కరించడంపై నివేదిక అందజేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూములలో 2019 అక్టోబర్ 15 నాటికి ఇళ్లు కట్టుకొని, ప్రస్తుతం నివాసముంటూ, ఇంటికి సంబంధించిన ఆధార పత్రాలు కలిగి, ఎక్కడా ఇళ్లు లేని వారికి ప్రభుత్వం కల్పించిన క్రమబద్ధీకరణ పథకానికి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. కొత్తగా ఇళ్ల స్థలాలు కేటాయించడానికి ప్రస్తుతం గల లేఅవుట్లలో అందుబాటులో ఉన్న స్థలాల వివరాలు సేకరించి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రీ-సర్వే భూయజమానులు సమక్షంలోనే చేయాలని, వీటిల్లో అవకతవకలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయకట్టు భూములకు నీటితీరువా వసూలు చేయాలన్నారు. కోర్టు కేసులు పెండింగు లేకుండా వెంటనే కోర్టులలో కౌంటర్లు దాఖలుచేయాలని కోరారు. సమాచార హక్కు చట్టం ద్వారా వచ్చే దరఖాస్తులకు మీ దగ్గర ఉన్న సమాచారాన్ని వెంటనే గడువులోపల అందించాలన్నారు. ఉద్యోగ విరమణ చేసే వారి పెన్షను ప్రపోజల్స్ ముందుగానే పంపించి, ఆర్థిక ప్రయోజనాలను ఉద్యోగ విరమణ రోజునే అందించాలని సూచించారు. ఉచిత విద్యుత్ పొందుతున్న ఎస్‌సి, ఎస్‌టి వినియోగదారుల ఇంటిపై సోలారు యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి మాట్లాడుతూ రెండవ విడత రీసర్వే చేపడుతున్న గ్రామాలలో గ్రామసభలు నిర్వహించాలని, రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ముందుగా భూ యజమానులకు నోటీసులు అందజేయాలని ఆదేశించారు. వార్తాపత్రికలలో వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే చర్యలు తీసుకొని, నివేదికను అందజేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఓ వై.సత్యనారాయణరావు, సర్వే ల్యాండు రికార్డ్స్ సహాయ సంచాలకులు గోపాలకృష్ణ, కెఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్‌వివిఎస్.సుబ్బలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి కెవిఎల్ఎన్.మూర్తి, ఆర్‌డిఓలు, కలెక్టరు కార్యాలయ సూపరింటెండెంట్లు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు ఆలోచన విరమించుకోవాలి

- ప్రయివేటు ఏజెన్సీలకు ఇచ్చే ప్రయత్నాలు సరికాదు
- మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి
- సిఐటియు ఆధ్వర్యంలో జోనల్ ఆఫీసు వద్ద ధర్నా



జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ప్రైవేట్ ఏజెన్సీలు వద్దని, పర్మినెంట్ చెయ్యాలని, సమ్మెకాలపు ఒప్పందాలకు జిఓలు జారీ చెయ్యాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా ఉద్యోగ విరమణ చేయొద్దని, ఉద్యోగ విరమణ వయస్సు 62కు పెంచాలని, గ్రాట్యూటీ చెల్లించాలని కార్మికులు పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల శ్రమను గుర్తించి పర్మినెంట్ చేస్తుందని ఆశిస్తే, పెనం మీద ఉన్న కార్మికులను పొయ్యిలోకి తోసేస్తానంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆప్కాస్ ద్వారా ప్రతి నెలా 1వ తేదీన కార్మికుల అకౌంట్‌లోకి జీతాలు వస్తున్నాయని, పిఎఫ్, ఇఎస్ఐ నిధులు ఆయా ఖాతాలలో ఏవిధమైన కోతలు లేకుండా జమ అవుతున్నాయని తెలిపారు. అదే ప్రైవేట్ ఏజెన్సీలు రంగంలోకి వస్తే వాటి ఇష్టారాజ్యంగా మారి కార్మికులు వస్తులతో బతకాల్సిన పరిస్థితి దాపురిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కాస్‌ను రద్దు చేయాల్సి వస్తే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జోనల్ కమిటీ గౌరవాధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో ఎన్ఎంఆర్, బదిలీ, కోవిడ్ తదితర పేర్లు పెట్టి కార్మికులకు 21 వేల జీతం చెల్లించకుండా మున్సిపల్ కార్మికుల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జోన్ అధ్యక్ష కార్యదర్శులు ఎర్రంశెట్టి శివ, అజయ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పరమేశ్వరరావు, సంతోష్, బి రాము, శ్రీనివాస్, నూకరాజు, అమ్మాజమ్మ, తెలయ్యబాబు, కార్మికులు పాల్గొన్నారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : నోబుల్ టీచర్స్ అసోసియేషన్ బుచ్చియ్యపేట మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బోని అప్పలనాయుడు, ఎంవి.నూకేష్ ఎన్నికయ్యారు. వీరికి ఎంఈఓలు బొంజు బాబు, బుద్ద కాశి, అనకాపల్లి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణ, శ్రీను, ఉపాధ్యక్షులు రాజా రమేష్ అభినందనలు తెలిపారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : వేసవికాలంలో అనకాపల్లి నియోజకవర్గంలో ఏ గ్రామానికి తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అధికారులను ఆదేశించారు. అనకాపల్లి, కసింకోట, మునగపాక మండలాల్లో అన్ని గ్రామాలకు తాగునీటిని అందిస్తున్న సంపతిపురం వాటర్ ప్రాజెక్టును ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ విజయలక్ష్మి, ఎఈ సుమ, ఇఇలతో కలిసి బుధవారం ఎమ్మెల్యే కొణతాల సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో తాను మంత్రిగా ఉన్నప్పుడు మూడు మండలాల్లో గ్రామాలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో సంపతిపురంలో మెగా వాటర్ ప్రాజెక్టును మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ఇటీవలే దీని అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు. చాలా గ్రామాలకు ఇప్పటికీ ఈ ప్రాజెక్టు ప్రయోజనం అందలేదని, కోటి రూపాయలతో పనులు తక్షణమే ప్రారంభించి ప్రజల తాగునీటి సమస్యను తగ్గించాలని అధికారులను ఆదేశించారు.

సమస్యలపై వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు బుధవారం పార్టీ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించారు. కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర చొరవతో ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పెదపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు మరణించిన పార్టీ కార్యకర్త బొడ్డపు త్రినాథ్ కుటుంబానికి పార్టీ నుంచి రూ.5 లక్షలు బీమా సొమ్ము అందజేశారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొలకులూరి విజయబాబు, జిల్లా అధికార ప్రతినిధి కాండ్రకోన చిరంజీవి, పట్టణ అధ్యక్షులు గొర్లె నానాజీ, కార్యదర్శి ఆడారి రమణబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, బొడ్డపు శ్రీనివాసరావు, ఆదిమూర్తి, కొరారు సాంబ, కరణం రవికుమార్, నమ్మి రమణ, గొర్లి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మారేపల్లిలో గిరినాగు హల్‌చల్

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని మారేపల్లి గ్రామంలో బుధవారం ఓ గిరినాగు హల్ చల్ చేసింది. గ్రామంలోని ఓ పామాయిల్ తోటలో గిరినాగును చూసిన కొంత మంది రైతులు, అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వన్యప్రాణుల సంరక్షణ కమిటీ సభ్యులకు తెలియజేయగా, స్నేక్ కేచర్స్ వచ్చి బుసలు కొడుతున్న సుమారు 14 అడుగులున్న గిరినాగును చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ పామును అటవీ ప్రాంతంలో వదిలేస్తామని వారు తెలిపారు. అదే గ్రామంలో మరో గిరినాగు సంచరిస్తుండడంతో ఏ సమయంలో ఎలాంటి అపాయం సంభవిస్తుందోనని తోట సమీపంలోని రైతులు బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నేడు బుచ్చయ్యపేటలో ఎమ్మెల్యే గ్రీవెన్స్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు మేరకు గురువారం బుచ్చయ్యపేటలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు గ్రీవెన్స్ డే నిర్వహిస్తారని టిడిపి మండల అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక డెయిరీ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే స్వయంగా దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎంపిడిఒ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు.

వికలాంగులకు బస్ పాసులు జారీ

ప్రజాశక్తి-పరవాడ : అంతర్జాతీయ ఆటిజం దినోత్సవం సందర్భంగా పరవాడ భవిత కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా వికలాంగ విద్యార్థులకు బస్ పాసులు క్యాంపు నిర్వహించి 25 మందికి బస్సు పాస్‌లు జారీ చేశారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఇఒ జి.సాయి శైలజ ఆటిజం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనకాపల్లి ఆర్టీసీ డిపో నుండి సిహెచ్ ధనలక్ష్మి, వైఎస్ కుమార్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి బస్ పాసులు జారీ చేశారు. వికలాంగులు, వారి తల్లిదండ్రులు, భవిత ఉపాధ్యాయులు టి కుమారి, జి శ్రీనివాస్ పాల్గొన్నారు.



వికలాంగులకు బస్ పాసులు జారీ చేస్తున్న దృశ్యం

క్వారీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలి

సిఐటియు జిల్లా నేతలు శంకరరావు, కోటేశ్వరరావు నిరసన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలంలోని క్వారీల్లో పనిచేస్తున్న కార్మికులకు కూలి రేట్లు పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు, జిల్లా ఉపాధ్యక్షులు జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని బవులువాడ గ్రామం దర్జీనగర్‌లో అనకాపల్లి క్వారీ కార్మికులు నిర్వహిస్తున్న నిరసన శిబిరాన్ని సిఐటియు నేతలు బుధవారం సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా శంకర్రావు, కోటేశ్వరరావు మాట్లాడుతూ క్వారీలలో కంప్రెషర్ డ్రిల్లర్లు అతి తక్కువ కూలీరేట్లతో పని చేస్తున్నారన్నారు. నిత్యం క్వారీ ధూళితో ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయని తెలిపారు. కార్మికుల శ్రమతో క్వారీ యజమానులు కోట్లకు పడగలెత్తుతుంటే, కార్మికులు మాత్రం అనారోగ్య పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే, అందుకు అనుగుణంగా కూలి రేట్లు పెంచడం లేదన్నారు. నిత్యం ప్రమాదాల మధ్యన పనిచేస్తున్న క్వారీ కంప్రెసర్ వర్కర్లు ప్రమాదాలు జరిగితే ఆదుకునే నాథుడు లేడని, ఇన్సూరెన్స్ సౌకర్యం లేక చనిపోయిన కార్మికుడి కుటుంబాన్ని యజమానులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి కార్మికులను తీసుకొచ్చి బానిసల్లా వనిచేయించుకుంటున్నారని విమర్శించారు. దీనిపై కార్మిక శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, యజమానులను పిలిచి సమస్య పరిష్కరించాల్సింది పోయి చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. జిల్లా అధికార యంత్రాంగం కూడా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికార యంత్రాంగం జోక్యం చేసుకొని 200 మంది కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్రావు

రెండో రోజు వంటా వార్పు

క్వారీ డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ కార్మికుల సమ్మె రెండవ రోజు బుధవారం కొనసాగింది. వంటా వార్పు చేస్తూ తమ నిరసన తెలియజేశారు. సమ్మె శిబిరాన్ని నవ యువ సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యులు నందారపు భాస్కరరావు సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. కొండలను, బండలను కరిగించి యజమానులకు కోట్లాది రూపాయలు లాభాలు సంపాదించి పెడుతున్న కార్మికులకు కూలి రేట్లు, జీతాలు పెంచకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్టియు నాయకులు కోన మోహన్, ఎస్.భాస్కర్, ఎస్ అప్పలనాయుడు, జి సూర్యారావు, క్వారీ కార్మిక సంఘం నాయకులు సేనాపతి అప్పల నాయుడు, చింతల రమేష్, ఏ.అప్పలనాయుడు, లింగ, సిహెచ్ చిన్నారావు, చవితిన నూకరాజు, గొర్రపల్లి తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత జిల్లాయే నవోదయం లక్ష్యం

- ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబర్ 14405
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాను నాటుసారా రహితంగా మార్చడమే నవోదయం 2.0 ప్రధాన ఉద్దేశ్యమని, ఆ దిశగా జిల్లాలో సమూలంగా నాటు సారాను నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలనా కార్యక్రమం "నవోదయం 2.0" పై పోలీస్, అటవీ, పంచాయతీరాజ్, గిరిజన శాఖలతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా చాలా జిల్లాల సరిహద్దు ప్రాంతాలను కలిగి వుండడంతో ఎన్ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు మరింత సూక్ష్మ దృష్టి వ్యవహరించాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో కమిటీలను నియమించాలని, రెండు నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం అమలుపై అన్ని అనుబంధ శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జిల్లాలో ఐడి లిక్కర్ పీడిత గ్రామాల జాబితాను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించడం జరిగిందని, ఏ కేటగిరిలో 21 గ్రామాలు, బి కేటగిరిలో 45 గ్రామాలు, సి కేటగిరిలో 85 గ్రామాలను గుర్తించడం జరిగిందని తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి ప్రత్యామ్నాయంగా గొర్రెలు, ఆవులు, దుకాణాలు ద్వారా ఉపాధి పొందేలా బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు సహకరిస్తామని చెప్పారు. నాటు సారా తయారీ, రవాణా విక్రయాలు కొనసాగించే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. స్థానిక తహశీల్దారు వద్ద రూ.లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేయడం జరుగుతుందని, తర్వాత ఏడాది పాటు బెయిల్ రాకుండా పిడి యాక్ట్ నమోదు అవుతుందని పేర్కొన్నారు. ఈ నేరం చేసిన వారికి 8 సంవత్సరాలు జైలు శిక్షతోపాటు రూ.5 లక్షల వరకు జరిమానా కోర్టు విధిస్తుందని, అందువల్ల ఈ విషయాలు ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సూర్జిత్ సింగ్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధీర్, జిల్లా అటవీశాఖ అధికారి శామ్యూల్, జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్) మోహన్ రావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగ శిరీష, ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బిసి రుణాల ఇంటర్వ్యూలకు అనూహ్య స్పందన

ప్రజాశక్తి-యలమంచిలి

బిసి సబ్సిడీ రుణాల కోసం మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు అనూహ్య స్పందన లభించినట్లు కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 328లో 272 మందిలో ఇంటర్వ్యూలకు హాజరైనట్లు చెప్పారు. బ్యాంకులు ఇస్తున్న రుణాల పట్ల నమ్మకంతో లబ్ధిదారులు హాజరు కావడం శుభశూచకమన్నారు. ఎంపికైన లబ్ధిదారులకు వీలైనంత తొందరలో రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో మెప్మా సిఎంఎం పద్మావతి, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు బొడ్డపు శ్రీనివాసరావు, సిఒఎస్ రమణ, సత్య, కృష్ణవేణి, వెల్ఫేర్ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎపిజివిబి, బ్యాంక్‌ఆఫ్ బరోడా, కెనరాబ్యాంకు, యూనియన్ బ్యాంకు, వైశ్యాబ్యాంకు, డిసిసిబి బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బీసీ, కాపు, ఓసి కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు బుధవారం బుచ్చయ్యపేట ఎంపిడిఒ కార్యాలయంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 140 యూనిట్లకుగాను 632 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారంతా ఉదయం 10 గంటలకే కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపిడిఒ వి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి. బ్యాంకర్లు వచ్చేవరకు ఎండలో పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇంటర్వ్యూలకు హాజరైన చంటి పిల్లల తల్లులు, వికలాంగులు, గృహిణులు ఇబ్బంది పడ్డారు. సాయంత్రం వరకు ధ్రువపత్రాల వెరిఫికేషన్ కొనసాగింది. ఎంపికైన లబ్ధిదారుల జాబిత త్వరలోనే ప్రకటిస్తామని ఎంపిడిఒ తెలిపారు.

ఆకతాయిల ఆట కట్టించేందుకు శక్తి టీమ్స్

ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, మహిళలకు రక్షణగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేకంగా శక్తి టీమ్స్‌ను నియమించామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శక్తి టీమ్స్ నిర్వర్తించే విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై బుధవారం ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, ముఖ్య కూడళ్ళను (హాట్ స్పాట్స్ ను) మఫ్టీలో సందర్శించి, మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపడతారని తెలిపారు. జిల్లాలో అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నం పట్టణాలలో ఆరుగురు పోలీసు సిబ్బందితో ఐదు బృందాలుగా మొత్తం 30 మందితో శక్తి టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఒక్కొక్క బృందానికి ఎస్సై నాయకత్వం వహిస్తారని తెలిపారు. ఆపద సమయంలో శక్తి యాప్‌కు వచ్చే ఎస్ఓఎస్ కాల్స్, డయల్ 112/100 కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలంకు చేరుకోవాలని సూచించారు. అక్కడ సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ బందాల పని తీరును జిల్లాలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ పర్యవేక్షిస్తారని, మహిళా పిఎస్ డిఎస్పీ ఇ.శ్రీనివాసులు నోడల్ అధికారిగా ఉంటారని తెలిపారు. శక్తి టీమ్స్‌ను రాష్ట్ర డిజిపి కార్యాలయం కూడా పర్యవేక్షిస్తుందని, వారి ఆదేశాల మేరకు పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, మహిళా పిఎస్ డిఎస్పీ ఇ.శ్రీనివాసులు, సిఐ చంద్రశేఖర్, ఎస్సై మనోజ్ కుమార్, శక్తి టీమ్స్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పి తుహిన్ సిన్హా


మాట్లాడుతున్న తహశీల్దార్

రెవెన్యూ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి -కోటవురట్ల:రెవిన్యూ సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని తహసిల్దార్ తిరుమలబాబు సూచించారు.బుధవారం కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రీ సర్వే జరుగుతున్న గ్రామాలలో సిబ్బంది రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలన్నారు. రైతులు చేసుకున్న ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు. విద్యార్థులు చేసుకున్న వివిధ దరఖాస్తులను ధ్రువీకరించి ధ్రవపత్రాలు అందజేయాలని సూచించారు. నీటి తీరువా పన్నుల వసూలుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి రమేష్, మండల సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్వోలు విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- మాడుగుల:విద్యుత్ లైన్ల మరమ్మత్తు పనులు, సబ్ స్టేషన్ పెయింటింగ్ వేయడం కారణంగా మాడుగుల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న మాడుగుల పంచాయతీ ఘాటి రోడ్డు, వాడపాడు, వీరనారాయణం, గొట్టివాడ అగ్రహారం, చింతలూరు, జంపిన, డి. సురవరం గ్రామాలకు ఈనెల 3, 4తేదీల్లో ఉదయం 7:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్కు అంతరాయం ఏర్పడుతుందని నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.


దగ్ధమవుతున్న పాకలు

నక్కపల్లి సంతలో అగ్ని ప్రమాదం

-40 పాకలు దగ్ధం
-రూ.20 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లి వారపు సంతలో అగ్ని ప్రమాదం జరగడంతో 40 పాకలు కాలి బూడిదయ్యాయి. సుమారుగా 20 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది. బుధవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో సంతలో ఉన్న కమ్మల పాకలన్నీ దగ్ధమయ్యాయి. సంత పక్కనే ఉన్న రెండు ఇళ్లల్లోకి మంటలు వ్యాపించాయి. నక్కపల్లిలో సంత పక్కనే అగ్నిమాపక కేంద్రం ఉన్నప్పటికీ, వేరేచోట అగ్ని ప్రమాదం సంభవించడంతో ఫైర్ ఇంజన్ అక్కడకు వెళ్ళింది. దీంతో, హేటిరో డ్రగ్స్ కంపెనీ నుండి, ఎలమంచిలి నుండి అగ్రిమాపక వాహనాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. అప్పటికే సంతలో ఉన్న పాకలు దగ్ధమయ్యాయి. నక్కపల్లిలో ఫైర్ ఇంజన్ అందుబాటులో ఉంటే ఇంత ప్రమాదం జరిగి ఉండేది కాదు. ప్రతి శుక్రవారం నక్కపల్లిలో భారీ వారపు సంత జరుగుతుంది. పలు ప్రాంతాల నుండి చిరు వ్యాపారులు ప్రతి శుక్రవారం వచ్చి కూరగాయలు, ఇతర సరుకులు విక్రయిస్తారు. ఎండు చేపల వ్యాపారం ఇక్కడ ప్రత్యేకం. ఒరిస్సా తో పాటు ఇతర జిల్లాల నుంచి వ్యాపారులు లారీలతో ఎండు చేపలు తెచ్చి వ్యాపారం సాగిస్తుంటారు. మేకలు, కోళ్ల వ్యాపారం కూడా సంతలో సాగుతుంది. అగ్నిప్రమాదం శుక్రవారం జరిగి ఉంటే భారీ నష్టం జరిగి ఉండేది. తహసిల్దార్ నరసింహుమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, సీఐ కుమారస్వామి, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, జనసేన నాయకులు శివ దత్, టిడిపి నాయకులు కొప్పిశెట్టి బుజ్జి తదితరులు సంఘటన ప్రాంతానికి చేరుకొని, పరిశీలించారు. జాతీయ రహదారికి ఆనుకుని వారపు సంత ఉండడంతో పోలీసులు వాహనాలను దారి మళ్లించారు.

తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు హెూం మంత్రి అనిత ఆదేశించారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. సంతలో ప్రభుత్వమే షెడ్లు నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు కోరారు. కమ్మలు పాకలు పూర్తిగా అగ్నికి దగ్ధం అవ్వడంతో చిరు వ్యాపారులు పూర్తి గా నష్టం పోవడం జరిగిందని, ప్రభుత్వమే బాధ్యత తీసుకుని షెడ్లు నిర్మించి వ్యాపారులను ఆదుకోవాలని అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ కోరారు.

వ్యవసాయ పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-రావికమతం:వ్యవసాయ పరికరాలను రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని చోడవరం శాసనసభ్యులు కే ఏఎస్ ఎన్ ఎస్ రాజు కోరారు. ఈ సందర్భంగా మేడివాడ గ్రామానికి చెందిన గొల్ల వెల్లి వెంకటరమణ, విరోధి రామకృష్ణలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా వ్యవసాయం పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, ఫుడ్ సెక్యూరిటీ మిషన్ స్కీములో మల్టీ క్రాప్ ట్రేసర్స్ 80000 రూపాయలు రాయితీతో రైతులకు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. బ్యాటరీ స్పేయర్స్ కూడా రాయితీతో ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. రైతాంగానికి దమ్ము సేట్లు, నైన్ టై కల్టివేటర్స్, పవర్ స్ప్రేయర్స్, బ్రుష్ కటరస్ మొదలగు వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నట్లు అయన తెలిపారు. రైతులు వీటన్నింటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో పుష్ప, ఎంపీడీవో వెంకన్న బాబు, రావికమతం మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు నాయుడు, రావికమతం సర్పంచ్ గెంజి మొది నాయుడు, ఎంపీటీసీ నాగేశ్వరావు, తట్టబంద ఎంపీటీసీ పిల్ల శేషుబాబు పాల్గొన్నారు.


పరామర్శిస్తున ఎమ్మెల్యే గణేష్

వైసిపి నేతపై అక్రమ కేసులు అన్యాయం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం వైసీపీ నాయకులు కర్రి శ్రీనివాసరావును కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టు చేయిందని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆరోపించారు. బుధవారం సాయంత్రం కర్రి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో ఫిబ్రవరి 24తేదీన కర్రి శ్రీనివాసరావు సోదరుడు ఇంటిని కూల్చేయడంతో కర్రీ శ్రీను కుటుంబానికి అన్యాయం జరగడంతో కర్రి శ్రీను స్పీకర్ అయ్యన్నపాత్రుడుని దూషించడంపై కర్రి శ్రీనుపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు నాలుగు ప్రాంతాల్లో కేసు పెట్టించడం జరిగిందన్నారు. ఈ రోజు ఉదయం 8 గంటలకు కర్రి శ్రీను తన నివాసం నందు టౌన్ పోలీస్‌లు వచ్చి నంద్యాల జిల్లా జాలదుర్గం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిందని, అరెస్ట్ చేస్తున్నామని జీపు ఎక్కించుకొని వెళ్లారన్నారు. అనంతరం తుని హైవేలో నంద్యాల పోలీస్‌లకు శ్రీనును అప్పగించారన్నారు. ఈ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు.


ప్రారంభిస్తున్న సర్పంచ్

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు మాట్లాడుతూ, బాటసారులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, రాంబాబు, సీనియర్ టిడిపి నాయకులు వార్డ్ సభ్యులు హరిబాబు, ఈఓపిఆర్డి రఘురాం, కార్యదర్శి నరసింహరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆటిజం దినోత్సవం


మేడివాడలో బహుమతులు ఇస్తున్న హెచ్ఎం

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ అటిజం అవగాహన దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం వంకాయల రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అటిజం వ్యాధి పై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు, సరోజిని తదితరులు మాట్లాడుతూ, అటిజం వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి తగిన శిక్షణను, స్పీచ్ తెరిపి, బిహేవియర్ మోడీ ఫికేషన్ అందిస్తే ఆటిజం వ్యాధిని కొంతవరకు దివ్యాంగ విద్యార్థుల్లో మార్పు తీసుకు రావచ్చునని అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆటిజం వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షలలో పాల్గొన్న వికలాంగు విద్యార్థులకు సాయ పడిన సహాయకులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ప్రోత్సాహక బహుమతులను పలువురు ఉపాధ్యా యులు చే అందజేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, అప్పలనాయుడు, ఎర్రయ్య, రమణాజి, గోవిందరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు

అనకాపల్లి : ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా అనకాపల్లి మండలం కొప్పాక భవిత కేంద్రంలో బుధవారం విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఆటిజం సమస్యతో బాధపడుతున్న పిల్లలకు అవగాహన సమావేశం నిర్వహించారు. అనకాపల్లి మండల ప్రత్యేక ఉపాధ్యాయులు బివి వరప్రసాద్, భవిత ఉపాధ్యాయులు యేసురత్నం, రమాదేవి మాట్లాడుతూ జన్యుపరమైన లక్షణాలు, గర్భధారణ సమయంలో తల్లికి ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, పర్యావరణ ప్రభావాలు వంటి వాటి వల్ల ఆటిజం సమస్యకు కారణమని చెప్పారు ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడిలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ఆటిజంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ముందుగా పిల్లలకు ఆటిజంపై అవగాహన కల్పించారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు బిఎ రాజు ఆటిజం రావడానికి గల కారణాలు, లక్షణాలు వివరించారు. బుచ్చయ్యపేట భవిత కేంద్రంలో ఆటిజంపై అవగాహన కల్పించారు. ఎంఈఓ బి కాశీ మాట్లాడారు. స్పెషల్ ఎడ్యుకేషన్, సైకోథెరపీ స్పీచ్ థెరపీల ద్వారా మానసిక పరిపక్వత పెంచవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్ పోతురాజు, కే దేముడు, హెచ్ఎం రఘురాం తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట భవిత కేంద్రం పిల్లలకు అటిజంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటిజం రావడానికి జన్య పరమైనా కారణాలు వున్నాయని చెప్పారు. ముందుగా పిల్లలు చే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెంబర్-2 స్కూల్ ప్రధానోపాధ్యాయలు సిహెచ్.రామునాయడు, అంధ ఉపాధ్యాయడు కొర్రుపోలు వెంకటేశ్వరారావు, భవిత కేంద్రం ఉపాధ్యాయలు ఇటి.రమణమ్మ, దీపా, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి:నక్కపల్లి భవిత కేంద్రంలో బుధవారం ఆటిజం డే సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ నరేష్, ఫిజియో థెరపిస్ట్ సీ. హెచ్.అనూషలు ఆటిజంపై అవగాహన కల్పించారు.వైద్యుల సలహాల మేరకు తగిన జాగ్రత్త లను పాటిస్తే ఈ సమస్యలనుండి పిల్లలను కాపాడుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఈ ఆర్పిలు డి.అరుణ, కె.గౌరి, కార్యాలయ సిబ్బంది ఝాన్సీ, శివ, సి ఆర్ పి లు శేఖర్, అప్పలనాయుడు, దేవి తదితరులు పాల్గొన్నారు.గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయురాలు షేక్ యాస్మీన్ అవగాహన కల్పించారు.

ఆనందపురం: అటిజం వ్యాధిపై అవగాహన అవసరమని సహితవిద్య ఉపాధ్యాయులు కలమటి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, పిల్లల్లో వయసుకు తగ్గట్టు మానసిక ఎదుగుదల లేకపోవడం, చేసిన పనిని పదేపదే చేయడం, మాట్లాడడంలో తడబాటు, సామాజిక పరస్పర చర్యల్లో ఇబ్బందులు పడటం, ఆలస్యంగా స్పందించడం వంటివి అటిజం లక్షణాలని, నాడీ సంబంధిత రుగ్మతపై అవగాహన అవసరమన్నారు. హెచ్ఎం కె. అంజనా కుమారి మాట్లాడుతూ, ఆటిజం పిల్లలకు విద్యా, సామాజిక అవసరాల్లో తోటి విద్యార్థులు సహకరించాలని, తద్వారా సామాజిక అవాంతరాలను అధిగమించి అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి , కె జయలక్ష్మి , సహిత విద్య టీచర్ ఐ.నాగమణి పాల్గొన్నారు.


బుచ్చయ్యపేటలో అవగాహన కల్పిస్తున్న ఎంఇఒ

ఆదివాసీలకు రక్షణ కల్పించాలి

-సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం ఎంకె.పట్నం పంచాయతీ శివారు చటర్జీపురం పివిటిజి ఆదివాసీలకు రక్షణ కల్పించాలని, కొయ్యూరు జెడ్పిటీసీ వారా నూకరాజుతో పాటు తన అనుచరులను అరెస్ట్ చేయాలని సిపిఎం, ఆంధ్రప్రదేశ్ 5వ షెడ్యూల్ సాధన కమిటీ ప్రతినిధి బృందం డిమాండ్ చేశారు. బుధవారం ధ్వంసం చేసిన తోటలను పరిశీలించి తోటల వద్ద స్థానికలతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎంకె.పట్నం రెవిన్యూ సర్వేనెంబర్ 139లోని పది ఎకరాలు మెట్టు భూమిని దశాబ్దాలుగా చటర్జీపురం గదబ ఆదివాసీలు సాగు చేస్తున్నారన్నారు. ఆదివాసులు సాగుబడిని భూమి రికార్డులలో నమోదు చేశారని, రెవిన్యూ అధికారులు తనిఖీ చేసి ఆదివాసీల సాగులో ఉన్నారని నిర్ధారిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు కూడా ఇచ్చారన్నారు. చటర్జీపురం ఆదివాసీలు సాగు చేయడంతో పాటు అక్కడే జీవిస్తున్నారన్నారు. 2021 చివరిలో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామంకు చెందిన మల్లిడి రామిరెడ్డి అనే ఒక వ్యక్తి ఈ భూములను కొనుగోలు చేశానని ఆదివాసీలను తొలగించడానికి ప్రయత్నం చేశాడన్నారు. దానికి మద్దతుగా కొయ్యూరు జెడ్పిటీసీ వారా నూకరాజు నిలబడ్డాడని, చటర్జీపురం ఆదివాసీలు నర్సీపట్నం సివిల్ కోర్టులో, వారా నూకరాజు, మల్లిడి రామిరెడ్డిలపై కేసు దాఖలు చేశారని తెలిపారు. ఈ కేసులో రామిరెడ్డి గైహాజరు కాగా నూకరాజు కొనసాగుతున్నాడన్నారు. ఇదిలా ఉండగా 2023 జనవరి నెలలో ఈ భూమిని, తన పేరుతోను, ఐటిడిఎ పాడేరు పరిధిలో టీచర్‌గా పని చేస్తున్న తన కొడుకు కన్నబాబు పేర్లతో మల్లి డి రామిరెడ్డి నుండి కొనుగోలు చేశాడని, కేసు విచారణలో ఉంటుండగానే, ఆదివాసీల సాగు అనుభవంలో ఉన్నారని తెలిసి, కావాలనే ఈ భూములను కొనుగోలు చేశారన్నారు. అప్పటినుండి చటర్జీపురం ఆదివాసీలపై బెదిరింపులకు పాల్పడుతూ, దాడులు చేస్తూ వస్తున్నాడన్నారు. 2023 సెప్టెంబర్ నెలలో ఈ వారా నూకరాజు, టీచర్ కన్నబాబులు 70 మంది కిరాయి మూకలతో ఆదివాసీలపై దాడులు చేశారని తెలిపారు. ఇరువురి పైన పోలీసులు కేసు నమోదు చేశారు.ఆదివాసీలు దాఖలు చేసిన కేసు విచారణలో ఉండగా, ఆ కేసులో గైర్ హాజరైన వ్యక్తి నుండి భూములు కొనుగోలు చేసి దశాబ్దాలుగా సాగు అనుభవంలో ఉన్న ఆదివాసీలను తొలగించడానికి వారా నూకరాజు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నాడని తెలిపారు. ఇరువర్గాలని పొలం జోలికి వెళ్ళవద్దని గిరిజన వెనుకున్న పంటలను అలానే ఉంచాలని చెప్పి పోలీసులు సంతకాలు చేయించుకున్నారన్నారు. వారా నూకరాజు నాయకత్వంలో నాలుగు ఆటోలోనూ, 50 మంది గుండాలను తీసుకొని వెళ్లి గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను ధ్వంసం చేశారని, వారిపై చర్యలు తీసుకుని చటర్జీపురం గిరిజనులకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఈరెల్లి చిరంజీవి, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షులు కే.గోవిందరావు, పివిటిజి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొండతాంబలి వెంకట్రావు, కేదారి కృష్ణ, కేదారి రాజేశ్వరి, ఈదల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు, ఆదివాసీలు



పరిశీలిస్తున్న ఎంపిడిఒ

తడి, పొడి చెత్తలపై అవగాహన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని నెల్లిపూడి, బంగారమ్మపేట, అమలాపురం గ్రామాల్లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను బుధవారం ఎంపీడీవో డి సీతారామరాజు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో తడి పొడి చెత్త సేకరించి సంపద కేంద్రాలకు తరలించి, సంపదను సృష్టించుకోవాలన్నారు. చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఈఓపిఆర్‌డి శ్రీను, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-రావికమతం:నూతనంగా మంజూరైన సామాజిక పెన్షన్లను వితంతువులు సద్వినియోగం చేసుకోవాలని చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గెంజి అచ్చియమ్మ, మచ్చకర్ల కన్నయ్యమ్మలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్లను అందజేశారు. కల్లుగీత కార్మికుల కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్న బాబు, సర్పంచ్ గంజి మోది నాయుడు, జనసేన నాయకులు గంజి శ్రీనివాస్,(నెట్ శ్రీను) వికలాంగుల హక్కుల పోరాట సమితి చోడవరం నియోజకవర్గం కన్వీనర్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపాలిటీ జోగినాధునిపాలెం సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మాకవరపాలెం మండలం వజ్రగడ గ్రామానికి చెందిన తమరాన రాజుబాబు(50) రోడ్డుపక్కన మృతి చెంది ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు వచ్చి ఇతని మరణంపై ఎటువంటి అనుమానం లేదని, బాగా మద్యం సేవించడం, భోజనం సరిగా చేయకపోవడంతో సహజ మరణంగానే భావిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేయడంతో వారి కుటుంబ సభ్యులకు మృతిడిని అప్పగించినట్లు టౌన్ సీఐ గోవిందరావు తెలిపారు.



వ్యక్తి మృతదేహం

ఈదులపాలెం పిహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి-పాడేరు:మండలంలోని మారుమూల ప్రాంతమైన ఈదులుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఐఓ డాక్టర్ ఎం కిరణ్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా పలు రికార్డులను, ఆస్పత్రి పరిధిలో గర్భిణీల వివరాల నమోదు, ఓపి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల సబ్ సెంటర్‌లో ఇమ్యునైజేషన్ కార్యక్రమంను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ప్రభుత్వ భూములను గుర్తించాలి

-ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి- మాడుగుల:ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికిగాను ప్రజల నుండి 67 అర్జీలు వచ్చాయి.ఎమ్మెల్యే బండారు ప్రజల నుండి వినతుల స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామకంఠ భూములు ఆక్రమణకు గురయ్యాయని దానిపై అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఎమ్మెల్యే దృష్టికి పలువురు తీసుకొని వెళ్లారు.

తమ భూమి తామే సాగు చేసుకుంటున్నప్పటికీ అధికారులను అడ్డం పెట్టుకొని కొంతమంది ప్రజాప్రతినిధులు 1బిలు చేయించుకుని దౌర్జన్యానికి పాల్పడుతున్న విషయాన్ని కాశీపురం గ్రామానికి చెందిన ఓ మహిళ ఆధారాలతో చూపించడంతో మరొకరికి వన్ బి ఎలా ఇచ్చారని మండి పడ్డారు. మాడుగులలో శివయ్య స్కూల్ దగ్గర నుండి వేణుగోపాలస్వామి గుడి వరకు డ్రైనేజీ పేరుకుపోయి ఉందని, గ్రామ కంటానికి చెందిన రెండు ఎకరాల 93 సెంట్లు భూమి కబ్జాకు గురైనా అధికారులు పట్టించుకోలేదని స్థానిక న్యాయవాది శ్రీనాథ్ ప్రసాదరావు, మరువాడ ఈశ్వరరావు ఆరోపించారు. మాడుగుల మీదగా ఆర్టీసీ బస్సులు తిరగక ప్రజలు అవస్థలు పడుతున్నారని మండల సతీష్, మహేష్ లు,ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. అనంతరం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, భూమి ఒకరిదైతే మరొకరికి ఆన్లైన్‌లో వన్ బీలు ఏ విధంగా చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, ఎంపీపీ తాళ్లపరెడ్డి వెంకట రాజారామ్, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసిల్దార్ రమాదేవి, టిడిపి జనసేన మండలాధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు, గట్రెడ్డి శివాజీ, ఎస్సై జి నారాయణరావు పాల్గొన్నారు.

రావికమతం:గత వైసిపి ప్రభుత్వం అభివృద్ధి పనులు చేయలేదని చోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా రావికమతం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ గ్రీవెన్స్ కు ప్రజలు, తెలుగుదేశం పార్టీ నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రజలకు సత్వరంగా సేవలను అందించడానికి ఇప్పటికే వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో అనేక సేవలను అందిస్తుందన్నారు. గడిచిన 5ఏళ్ల కాలంలో ప్రజా సమస్యల్ని గాలికి వదిలి వేశారన్నార.ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షులు రాజాన కొండ నాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఫ్యాషన్ టెక్నాలజీ గోదాము

-తుప్పు పడుతున్న పరికరాలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గడచిన రెండు దశాబ్దాలుగా ఫ్యాషన టెక్నాలజి గోదాము వృథాగా పడి ఉన్నాయి. నాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో ఈ గోదాములో ఫ్యాషన్ టెక్నాలజీ ఏర్పాటు చేశారు. మండల, పరిసర వాసులకు ఉపాధి ఇస్తుంది అనుకున్న ఫ్యాషన్ టెక్నాలజీ గోదాము మూడు నాళ్ల ముచ్చటగా మిగిలిపోయింది. కోట్ల రూపాయలు ఖర్చు చేసిన సామగ్రి గోదాములలో తుక్కుగా మారిపోతుంది. ఫ్యాషన్ టెక్నాలజీ ఏర్పాటు చేయకముందు ఈ గోదాము నుండి పౌరసరఫరాల శాఖ నిత్యావసర వస్తువులు నిలువచేసి గ్రామీణ ప్రాంతాలకు సరఫరా చేసేవారు. దీని ద్వారా మండల పరిషత్ కు ఆదాయం కూడా లభించేది. ఫ్యాషన్ టెక్నాలజీ ఏర్పాటు చేసిన తర్వాత మండలానికి వచ్చే ఆదాయం పోగా కోట్ల రూపాయలకు విలువ చేసే మెటీరియల్ అంతా వృథాగా పడివుంది, కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వము అయినా వృథాగా ఉన్న ఫ్యాషన్ టెక్నాలజీ మెటీరియల్ను, గోదాములను ఉపయోగించుకొని పరిసర ప్రాంత వాసులకు ఉపాధి కల్పించాల్సిందిగా పలువురు కోరుకుంటున్నారు.



నిరుపయోగంగా ఫ్యాషన్ టెక్నాలజీ గోదాము



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కెజిబివి విద్యార్థిని సత్తా

ప్రజాశక్తి-హుకుంపేట:స్థానిక కెజీబీవి విద్యాలయం విద్యార్థి వన్నెపూరి మంజు ప్రియ తంగ్ టా మార్షల్ ఆర్ట్స్ లో రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ విద్యార్థి 8వ తరగతి చదువుతుంది.ఈ సందర్భంగా బుధవారం మంజు ప్రియ ని ప్రిన్సిపల్ ఎన్.అనిత, సిబ్బంది సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎన్ అనిత మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడారంగంలో విద్యార్థులు రాణించాలన్నారు. రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఏడవ తేదీన మణిపూర్లో జాతీయస్థాయి పోటీల్లో తమ విద్యార్థి పాల్గొంటుందని ఆమె తెలిపారు.